క్లుప్తంగా

ఉగాది సేవా శ్రేష్ఠ పురస్కారాల ప్రదానం



చిక్కడపల్లి: జీవిత ప్రయాణానికి స్త్రీ పురుషులు బండి చక్రాల వంటి వారని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త బంగారయ్య శర్మ అన్నారు. సోమ వారం శోభకృత్ నామ ఉగాది పండుగ సందర్భంగా నడింపల్లి యమునా పాఠక్ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో సేవలందించిన దంపతులకు ఉగాది పురస్కారాలు, సేవా శ్రేష్ఠ పురస్కారాల ప్రధానోత్సవ సభను కళాదీక్షితులు హాల్‌లో నిర్వహించారు. ఓలేటి పార్వతీశం, సవిత మాడ భూషి, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

చిరువ్యాపారికి తోపుడు బండి అందజేత



అంబర్‌పేట: సామాన్యులకు ఉపాధి కల్పించేందకు తనవంతు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. సోమవారం బాగ్ అంబర్‌పేట బర్షుగల్లీకి చెందిన చిరువ్యాపారి సాంబశివుడికి ఎమ్మెల్యే తన సొంత ఖర్చులతో తోపుడు బండిని అందజేశారు. పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

'బ్యాంకు యాజమాన్యం ఉద్యోగులను వేధిస్తోంది'

కవాడిగూడ: ఫెడరల్ బ్యాంకు యాజమాన్యం ఉద్యోగులను వేధిస్తోందని అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం (ఏఐబీఈఏ) కార్యదర్శి రాంబాబు ఆరోపించారు. ఈ పద్ధతికి యాజమాన్యం స్వస్తి పలకకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు. సోమవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో ఫెడరల్ బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో వేధింపులకు నిరసనగా ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. యాజమాన్యం ఉద్దేశ పూర్వకంగానే వేధింపులకు గురిచేస్తూ.. ఉద్యోగుల్లో భయానక వాతావరణం సృష్టిస్తోందన్నారు. ఉద్యోగులతో పాటు ఉద్యోగ సంఘం నేతలను కూడా యాజమాన్యం వేధించడం సరికాదన్నారు. ఫెడరల్ బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సుజిత్‌రాజ్, యూనియన్ ఆర్గనైజర్ సెక్రటరీ సుజిత్, రీజనల్ చైర్మన్ శ్రీకాంత్, శరత్, సురేష్‌రావు పాల్గొన్నారు.

రోడ్డు అక్రమించి టిఫిన్ సెంటర్ నడిపే వ్యక్తిపై కేసు

కాచిగూడ: నింబోలిఅడ్డలో రోడ్డును ఆక్రమించుకుని వ్యాపారం చేస్తున్న వ్యక్తిపై కాచిగూడ పోలీసులు కేసు నమోదు చేశారు. అడ్మిన్ ఎస్సై రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. స్థానికులు, పాదచారులు, వాహనదారులు నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

చిక్కడపల్లి: ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని చిక్కడపల్లి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్‌నగర్ ఫుట్‌పాత్‌పై 50 ఏళ్లున్న ఓ వ్యక్తి ఫుట్‌పాత్‌పై చనిపోయి పడి ఉన్న విషయాన్ని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో కానిస్టేబుల్ సాయికిరణ్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రంకన్ డ్రైవ్ కేసులో 15 మందికి జైలు.. జరిమానా

చిక్కడపల్లి: చిక్కడపల్లి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 15 మందికి జైలుశిక్ష, జరిమానాను నాంపల్లి నాల్గవ ఎంఎం కోర్టు జడ్జి విధించినట్లు ఇన్‌స్పెక్టర్ ధరావత్ నానునాయక్ తెలిపారు. మరో 10 మందికి జరిమా విధించారన్నారు. మద్యం సేవించి ఎవరూ వాహనాలు నడపవద్దని ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

వీధి కుక్కల దాడిలో ఏడేళ్ల బాలుడికి గాయాలు

అంబర్‌పేట: పాల ప్యాకెట్ కోసం బయటకు వెళ్లిన ఏడేళ్ల బాలుడిపై వీధి కుక్కలు దాడి చేసిన ఘటన అంబర్‌పేట డివిజన్ ప్రేమ్‌నగర్‌లో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన కథనం ప్రకారం.. ప్రేమ్‌నగర్‌లో నివసించే మణికంఠ కుమారుడు సాయి(7) సాయంత్రం 5 గంటల సమయంలో పాల ప్యాకెట్ కోసం బయటకు వచ్చిన సమయంలో వీధి కుక్కలు దాడి చేశాయి. స్థానికులు గమనించి బాలుడిని రక్షించారు. కుక్కల దాడిలో గాయపడిన బాలుడికి తల్లిదండ్రులు ఈఎస్ఐ ఆసుపత్రిలో చికిత్స చేయించారు.

బస్తీల్లో పోకిరీల బెడద

- గోల్నాక సెక్టర్‌లో సమస్య అధికం
- చీకటిపడితే బయటకు వచ్చేందుకు భయపడుతున్న మహిళలు
- పోలీసులు పట్టించుకోవడంలేదని స్థానికుల ఆరోపణ





అంబర్‌పేట: అంబర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రధానంగా గోల్నాక, అంబర్‌పేట డివిజన్‌లో పోకిరీల బెడద తీవ్రంగా ఉందని పలువురు ఆరోపిస్తున్నారు. గోల్నాకలోని కమలానగర్, తులసీనగర్, గంగానగర్, లంకబస్తీ, మూసీ పరివాహక ప్రాంతాల్లో యువకులు గుంపులుగా బస్తీ మలుపుల వద్ద తిష్ట వేసి వచ్చిపోయే వారికి ఇబ్బందులు కలిగిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- నరేంద్రనగర్, ఆహ్మదనగర్, న్యూ ప్రేమ్‌నగర్ తదితర ప్రాంతాల్లో సాయంత్రం నుంచి రాత్రి వరకు గల్లీల్లోనే తిష్ట వేస్తూ స్థానికంగా ఇబ్బందులు సృష్టిస్తున్నారని ప్రశ్నిస్తే దాడులకు పాల్పడుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- చీకటి పడగానే ఆయా బస్తీల్లో ఘర్షణ వాతావరం నెలకొంటోంది. మహిళలు, యువతులు బస్తీల్లో రాత్రివేళ బయటకు వెళ్లడానికి జంకుతున్నారు. పర్యవేక్షించాల్సిన పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. ఇప్పటికైనా పోలీసులు బస్తీల్లో గస్తీని పెంచి శాంతి భద్రతలను పరిరక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

అసాంఘిక కార్యక్రమాలతో..

ప్రధానంగా మూసీ పరివాహక ప్రాంతానికి అనుకుని ఉన్న గోల్నాక డివిజన్ ప్రాంతాలు చీకటి పడగానే అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారాయి. మద్యం సేవించడంతో పాటు గంజాయి, వైట్నర్ వంటి మత్తు పదార్థాలు కూడా తీసుకుంటున్నారని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మత్తులో గ్యాంగ్‌వార్‌లకు పాల్పడుతూ స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

కొన్ని సంఘటనలు..

గత నెల రోజుల క్రితం తులసీనగర్‌లో ఓ వ్యక్తి దారుణహత్యకు గురయ్యాడు. అదే రోజు ఇదే ప్రాంతానికి చెందిన సెక్టర్ ఎస్సై విధుల్లో ఉండటం గమనార్హం. నిత్యం పోలీస్‌స్టేషన్‌కు వచ్చే 10–12 ఫిర్యాదుల్లో గల్లీ ఘర్షణ ఫిర్యాదులే అధికంగా ఉన్నట్టు సమాచారం. వీటిలో గోల్నాక, అంబర్‌పేట డివిజన్‌లో జరిగే ఘటనలే అధికంగా ఉంటున్నాయి.

- గోల్నాక డివిజన్‌లో తలెత్తే శాంతి భద్రతల సమస్యపై స్థానిక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్ ఏకంగా నగర కమీషనర్ సీవీ ఆనంద్‌ను వ్యక్తిగతంగా కలిసి ఫిర్యాదు చేశారు. శాంతిభద్రతలపై అధికార పార్టీ కార్పొరేటర్ కమీషనర్‌కు ఫిర్యాదు చేయడం నియోజకవర్గంలో ఇదే మొదటిసారని పలువురు చర్చించుకుంటున్నారు.

పట్టించుకోని పోలీసులు...

పోకిరీల బెడద, యువత మధ్య ఘర్షణలపై నిత్యం ఫిర్యాదులు వచ్చినా.. పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- ఆయా ప్రాంతాల్లో సమస్య తలెత్తున్నట్లు స్థానిక సెక్టర్ అధికారి, పెట్రోలింగ్ సిబ్బందికి సమాచారం ఉన్నా పట్టించుకోకపోవడంపై స్థానికులు మండిపడుతున్నారు. ఫిర్యాదు చేస్తే నామమాత్రపు చర్యలు తీసుకుంటున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. 100కు ఫిర్యాదు చేస్తే ఫిర్యాదు దారుడు స్థానికుడని పోకిరీలకు పోలీసులే సమాచారం అందిస్తుండటంతో సమస్య రోజురోజుకు పెరుగుతోందని స్థానికులు వాపోతున్నారు.

చర్యలు తీసుకుంటాం



పోకిరిల బెడదపై సమాచారం వస్తుంది, నిర్దిష్ట ఫిర్యాదులు రావడం లేదు. అయినా పకడ్బందిగా పెట్రోలింగ్ చేపట్టి చర్యలు తీసుకుంటాము. పట్టుబడ్డ యువతకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నాము. అవసరమైతే పెట్టి కేసులు పెడుతున్నాము. ఏలాంటి ఇబ్బందులు ఉన్న తన దృష్టికి తీసుకువస్తే తక్షణ చర్యలు తీసుకుంటాము. అలాగే సీసీ కేమారాల ఏర్పాటుపై దృష్టి సారించాము.

– అశోక్ ఇన్‌స్పెక్టర్, అంబర్‌పేట్ పోలీస్‌స్టేషన్

రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి



మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

అంబర్‌పేట: పోలింగ్ బూత్ స్థాయిలో పార్టీని పటిష్టం చేసేందుకు బీజేపీ కార్యకర్తలు చురుగ్గా వ్యవహరించాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సూచించారు. ఆదివారం రాత్రి అంబర్‌పేట్ డివిజన్‌లో పార్టీ డివిజన్ అధ్యక్షులు భూషణ్‌చారి ఆధ్వర్యంలో బూత్‌స్వశక్తి కరణ్ అభియాన్ అభియాన్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇటీవల నిర్వహించిన పార్టీ కార్నర్ మీటింగ్‌లకు ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఇప్పటి నుంచే బూత్‌స్థాయిలో ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని కేంద్రమంత్రి కోరారు. బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్‌రావు, కృష్ణగౌడ్, ఆనంద్‌గౌడ్, యశ్వంత్, మైలారం రాజు తదితరులు పాల్గొన్నారు.

బాగ్‌అంబర్‌పేటలో..

డివిజన్‌లోని సీతా కాలనీలో సమావేశం జరగగా.. ఈ కార్యక్రమానికి కేంద్రమంత్రి హాజరయ్యారు. కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి, గద్వాల జిల్లా ఇన్‌చార్జ్ వెంకట్‌రెడ్డి, నాయకులు చుక్క జగన్, అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాలా ప్రహరీతో వరద ముంపునకు శాశ్వత పరిష్కారం



ప్రహరీ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్ తదితరులు

చిక్కడపల్లి: ప్రజా సమస్యల పరిష్కారానకి తగిన చర్యలు తీసుకుంటున్నామని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. గాంధీనగర్ డివిజన్‌లోని సబర్మతీనగర్ బస్తీలో సోమవారం హుస్సేన్‌సాగర్ నాలా ప్రహరీ నిర్మాణ పనులను ముఠా జైసింహతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుస్సేన్‌సాగర్ నాలా రిటైనింగ్ నిర్మాణంలో వరద ముంపునకు శాశ్వత పరిష్కారం అవుతుందన్నారు. కవాడిగూడ గోషాల నుంచి గోల్నాక నాలా వరకు రిటైనింగ్ వాల్ పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయన్నారు. ఇప్పటికే అరుంధతినగర్, దోభీఘాట్ బస్తీ, బాపునగర్, అశోక్ నగర్ ప్రాంతాల్లో పనులు పూర్తయ్యాయని తెలిపారు. పార్టీ యువజన విభాగం నాయకుడు ముఠా జైసింహ, ఎస్ఎస్‌డీపీ డీఈ ప్రవీణ్, ఏఈ శ్యామ్‌సుందర్, పార్టీ డివిజన్ అధ్యక్షుడు రాకేష్‌కుమార్, నాయకులు ముఠా నరేష్, ఎర్రం శ్రీనివాస్ గుప్తా, కృష్ణ, సత్యనారాయణ, కిరణ్‌కుమార్, హన్మంతు, రాజ్‌కుమార్, ఆనంద్, చందు, జహంగీర్, విఠల్, వెంకటేష్, స్థానిక నాయకులు గిరి, మహమ్మద్, యాసీన్, నర్సింగ్‌రావు, ముదిరాజ్, ఎం డీగోస్, రాజా, నందు తదితరులు పాల్గొన్నారు.

'చిల్లర రాజకీయాలు చేయడం సరికాదు'



మాట్లాడుతున్న ముషీరాబాద్ డివిజన్ కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్

ముషీరాబాద్: డివిజన్‌లో ఎమ్మెల్యే చిల్లర రాజకీయాలకు పాల్పడుతూ అడుగడుగునా అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ముషీరాబాద్ డివిజన్ కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నో నెలలు కష్టపడి కార్యాలయాల చుట్టూ తిరిగి అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయిస్తే ప్రొటోకాల్ పాటించకుండా తనకు తెలియకుండా ఎమ్మెల్యే ముఠా గోపాల్ హడావిడిగా పనులను ప్రారంభించి వెళ్తున్నారని మండిపడ్డారు. అధికారులు కూడా అభివృద్ధి పనులపై తమకు సమాచారం ఇవ్వడం లేదని ఆరోపించారు.

- రెండు రోజుల క్రితం ముషీరాబాద్ డివిజన్‌లోని షేర్‌అలీ గల్లీలో రూ.11 లక్షల వ్యయంతో వేసిన డ్రైనేజీ పైపులైన్ పనులను తాను మంజూరు చేయిస్తే తమకు తెలియకుండానే పనులు ప్రారంభించారని కార్పొరేటర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.
- ఇలాంటి విషయాలు అనేక సార్లు జరిగి ఎమ్మెల్యేతో వాగ్వివాదానికి దిగామని అయినా తన తీరు మార్చుకోకుండా పనులు ప్రారంభించి చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు.
- నాలుగేళ్లుగా ఎమ్మెల్యే ఈ ప్రాంతానికి రాలేదని ఈ ప్రాంత వాసులు పలు సమస్యలపై అనేక సార్లు ఫిర్యాదు చేసినా అధికారుల వద్దకి వెళ్లామని ఫోటోలను ప్రదర్శించారని వాపోయారు.
- రాంనగర్ రామాలయం వద్ద నిత్యం డ్రైనేజీ ప్రవాహంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రెండుసార్లు నిధులు మంజూరై వెనక్కి వెళ్లాయని ఆరోపించారు.

కాంగ్రెస్ నేతపై మహిళా కమిషన్‌లో ఫిర్యాదు



కమిషన్ చైర్‌పర్సన్‌కు ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ మహిళా నేత దేవిరెడ్డి విజితారెడ్డి తదితరులు

కాచిగూడ: భారత్ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై నిరాధారమైన ఆరోపణలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నేత బక్క జడ్సన్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ రాష్ట్ర మహిళా నేత దేవిరెడ్డి విజితారెడ్డి అన్నారు. మహిళా ప్రతినిధులు సోమవారం తెలంగాణ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీత లక్ష్మారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సీఎం కేసీఆర్ చేపట్టిన ఉద్యమ బాటలో నడుస్తూ.. ముందుకు సాగారని తెలిపారు. యువతకు ఉపాధి కోసం స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలను నిర్వహించి తెలంగాణలో యువతకు ఉపాధి కల్పించారన్నారు. కొన్ని యూట్యూబ్ ఛానల్‌లో ఎమ్మెల్సీ కవితపై పరుష పదజాలం ఉపయోగించాడని ఆరోపించారు. బీఆర్ఎస్ మహిళా నేతలు ఏకే స్వరూప గంగపుత్ర, తంగడపల్లి పల్లవి తదితరులున్నారు.

ఈటలకు జన్మదిన శుభాకాంక్షలు

కాచిగూడ: బీజేపీ జాతీయ నాయకులు, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ జన్మదినం సందర్భంగా సోమవారం అఖిల భారత ముదిరాజ్ సంఘం జాతీయ అధ్యక్షుడు వెంకటేశ్వర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ప్రతినిధుల బృందం ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ముదిరాజ్ నేతలు పృథ్వీ రాజ్, శ్రీనివాస్‌రాజ్, రమేష్, శ్రావణ్ పాల్గొన్నారు.

విజేతలకు అభినందనలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ అండ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ గతనెల 26న పబ్లిక్ గార్డెన్‌లోని జవహర్ బాల భవన్‌లో పర్యావరణంపై నిర్వహించిన చిల్డ్రన్ పెయింటింగ్ పోటీల్లో మాడపాటి హనుమంతరావు హైస్కూల్, లోటస్ లాప్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు తొలి విజేతలుగా ఎంపికయ్యారు. సీనియర్స్, జూనియర్స్ రెండు విభాగాల్లో మొత్తం 32 మంది విద్యార్థుల ప్రతిభను కనబరిచారు. దాదాపు 600 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీల్లో అందరూ అద్భుత ప్రతిభ కనబరిచారని కౌన్సిల్ గౌరవ అధ్యక్షులు వెంకటేశ్ గుప్తా, వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్.హెచ్.రంగయ్య పేర్కొన్నారు.

కలుషిత తాగునీటి సరఫరా

తీవ్ర ఇబ్బంది పడుతున్న ప్రజలు



కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్‌కు కలుషిత నీటిని చూపుతున్న స్థానికులు

కాచిగూడ: గత కొంత కాలంగా కాచిగూడ డివిజన్‌లోని నింబోలిఅడ్డ, చెప్పల్‌బజార్, ఇందిరానగర్, బండల బస్తీ, మౌలానా అజాద్‌నగర్, మోతీమార్కెట్, వీరన్నగుట్ట తదితర ప్రాంతాల్లో కలుషిత నీరు సరఫరా అవుతోంది. ఎప్పటికప్పుడు బాధిత ప్రాంతాల ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నా.. అధికారులు తాత్కాలిక చర్యలతోనే సరిపెడుతున్నారు. నల్లాల ద్వారా కలుషితనీరు సరఫరా అవుతుండటంతో ప్రజలకు ప్రాణ సంకటంగా మారింది. సోమవారం స్థానిక కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ ఆయా ప్రాంతాల్లో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వీరన్నగుట్టలో తాగునీరు సరఫరా చేసే బూస్టర్ చెడిపోవడంతో అక్కడ నీటి సమస్య తీవ్రంగా ఉన్నట్టు సమాచారం. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి ప్రజలు ఎదుర్కొంటున్న నీటి సమస్యను పరిష్కరించాలని కార్పొరేటర్ విజ్ఞప్తి చేశారు. బీజేపీ నేతలు రేణుక, లావణ్య, మాధవి, భీమ్‌రాజ్, ఆర్.సంతోష్, రవియాదవ్, ధీరజ్, రమేష్, దినేష్ తదితరులున్నారు.

'అనాథలను చిన్నచూపు చూస్తే సహించేది లేదు'

కాచిగూడ: అనాథల పట్ల చిన్నచూపు చేస్తే సహించేది లేదని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అనాథల సమస్యలను పరిష్కరించేందుకు సుముఖంగా ఉందని వారి సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీసీఎల్ఏ సెక్రటరీకి మంత్రి ఆదేశాలు జారీ చేసినట్లు తెలంగాణ రాష్ట్ర అనాథ హక్కుల పరిరక్షణ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, అనాథ హక్కుల ఐక్య వేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటయ్య సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అనాథలను అవమానపరిచినా, అగౌరవపరిచినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సమాచారం. ఈ మేరకు సీసీఎల్ఏ కార్యదర్శి నవీన్‌మిట్టల్‌కు ఆదేశాలు జారీచేసినట్లు ఆయన తెలిపారు.

రైతాంగానికి ఉన్న అప్పులను మాఫీ చేయాలి



మద్దతు ర్యాలీ నిర్వహిస్తున్న తెలంగాణ రైతాంగ సమితి నాయకులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దేశ రైతాంగానికి ఉన్న అప్పులను మాఫీ చేయడంతో పాటు కనీస మద్దతు ధరల చట్టం చేయాలని తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర అధ్యక్షులు జక్కుల వెంకటయ్య డిమాండ్ చేశారు. సోమవారం సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రామ్‌లీలా మైదానం ఢిల్లీలో నిర్వహిస్తున్న బహిరంగ సభకు మద్దతుగా సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అటవీ హక్కుల చట్టాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేయాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. అకాల వర్షాల కారణంగా నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. రైతాంగ సమితి ప్రధాన కార్యదర్శి గోపాల్, జిల్లా అధ్యక్షులు ఎం.డీ.ఖాజాముద్దీన్, మహేష్, పరంజ్యోతి, సైదులు తదితరులు పాల్గొన్నారు.

కచ్చా నాలా సమస్య పరిష్కారానికి చర్యలు



ఫ్రెండ్స్ కాలనీలో పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: ఫ్రెండ్స్ కాలనీలో కచ్చా నాలా సమస్యకు శాశ్వత పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. కాలనీలో డ్రైనేజీ, కలుషిత నీటి సమస్యను కూడా నెల రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. సోమవారం బీఆర్ఎస్ నగర నాయకులు పూస గోరఖ్‌నాథ్ ఆధ్వర్యంలో ఫ్రెండ్స్ కాలనీలో జీహెచ్ఎంసీ డీఈ గీతాకుమారి, జలమండలి సెక్షన్ మేనేజర్ నవీన్‌లతో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు వారి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాలనీలో కచ్చా నాలా నుంచి వెలువడే డ్రైనేజీ మురుగు, వ్యర్థాలను వెంటనే తొలగించి కలుషిత నీటి సరఫరా సమస్య రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బీఆర్ఎస్ యువజన విభాగం నగర నాయకులు ముఠా జైసింహ, డివిజన్ అధ్యక్షుడు నర్సింగ్‌ప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్‌రెడ్డి, నాయకులు శివముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, గోవింద్, ప్రశాంత్, బాబురావు, శ్రీనివాస్‌యాదవ్, శంకర్, గంగారాం తదితరులున్నారు.

ప్రభుత్వ పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాంనగర్ డివిజన్ బాగ్‌లింగంపల్లిలోని శ్రీరామ్‌నగర్ బస్తీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నెలకొన్న తాగు నీరు, డ్రైనేజీ సమస్యలతో పాటు శాశ్వత భవనాన్ని నిర్మించాలని బస్తీ నాయకులు ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. సోమవారం పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉన్నతాధికారులతో మాట్లాడి పాఠశాల పునరుద్ధరణకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ రాష్ట్ర యువజన నాయకులు ముఠా జైసింహ, డివిజన్ అధ్యక్షులు రావుల పాటి మోజేస్, ప్రధాన కార్యదర్శి దామోదర్‌రెడ్డి, బస్తీ అధ్యక్షుడు జయదేవ్, బీఆర్ఎస్ నాయకులు ఆర్.వివేక్, జనార్దన్, శివకుమార్‌యాదవ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

'మెకానికల్ ట్యాక్స్ నెపంతో భయపెడుతున్న అధికారులు'

కాచిగూడ: మెకానికల్ ట్యాక్స్ నెపంతో మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్లు లారీ డ్రైవర్లను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని 'జై ఇండియన్ లారీ ఓనర్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు ముస్తాఫా అంబేడ్కర్ ఆరోపించారు. సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణ స్వరూప్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ.. 'ప్రభుత్వం మాకు టార్గెట్ ఇచ్చిందని ఆ టార్గెట్‌ను మేము పూర్తి చేయాలని మెకానికల్ ట్యాక్స్ అనే సాకుతో వాహనదారులపై మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్లు కేసులు రాస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని' ఆరోపించారు. వీరి టార్గెట్ పూర్తి చేసుకోవాలంటే బార్డర్లలో అనేక వేల ఓవర్ లోడింగ్ లారీలు తిరుగుతున్నాయని వాటిపై కేసులు రాసి వీరి టార్గెట్‌ను పూర్తి చేసుకోవాలని సూచించారు. ఎంట్రీ ఫీజు ఇవ్వని వాహనదారులకు మెకానికల్ టాక్స్ కట్టాలని మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్లు, ఆర్టీఓ అధికారులు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. మెకానికల్ ట్యాక్స్ అనేది తెలంగాణ, ఆంధ్రలో ఎక్కడ వసూలు చేయడం లేదని వివరించారు. మెకానికల్ టాక్స్ అనే ఒక నెపంతో వాహనదారులకు భయభ్రాంతులకు గురిచేయడం సరికాదన్నారు.

టీఎస్‌పీఎస్సీ పరీక్ష పత్రాల లీకేజీపై విచారణ జరిపించాలి



మాట్లాడుతున్న బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్. గౌతంరావు



ముషీరాబాద్ చౌరస్తాలో కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న యూత్ కాంగ్రెస్ నేతలు

నల్లకుంట: టీఎస్‌పీఎస్సీ గ్రూప్ 1 ప్రశ్న పత్రాల లీకేజీకి బాధ్యత వహిస్తూ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్. గౌతంరావు డిమాండ్ చేశారు. పరీక్షలు రాసిన నిరుద్యోగులందరికి లక్ష రూపాయల నష్ట పరిహారం చెల్లించాలన్నారు. ఈ వ్యవహారంపై హైకోర్టు సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పిలుపు మేరకు బీజేపీ అంబర్‌పేట నియోజకవర్గం ఆధ్వర్యంలో సోమవారం నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి చౌరస్తా వద్ద 'మా నౌకర్లు మాగ్గావాలి' పేరిట నిరసన కార్యక్రమం చేపట్టారు. పేపర్ లీకేజీకి తనకు సంబంధం లేదన్నప్పుడు ఐటీ మంత్రి మీడియా సమావేశంలో ఎందుకు పాల్గొన్నారని నిలదీశారు. పేపర్ లీకేజీ వ్యవహారాన్ని ఇద్దరు వ్యక్తులు చేసిన తప్పిదమని మంత్రి వ్యాఖ్యానించడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు గీతామూర్తి, బీజేపీ మహిళా కార్పొరేటర్లు, బీ జేపీ గద్వాల జిల్లా ఇన్‌చార్జ్ వెంకట్ రెడ్డి, సెంట్రల్ జి ల్లా ఉపాధ్యక్షుడు వనం రమేష్, అజయ్‌కుమార్, బీసీ మోర్చా సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు వినోద్‌యాదవ్, నగర నాయకులు కన్నె రమేష్ యాదవ్, కృష్ణా గౌడ్, కిశోర్‌కుమార్ పాల్గొన్నారు.

రాంనగర్ చౌరస్తాలో..

ముషీరాబాద్: బీజేపీ అధిష్టానం ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం ముషీరాబాద్ అసెంబ్లీ కమిటీ ఆధ్వర్యంలో రాంనగర్ చౌరస్తాలో భారీ ధర్నా చేపట్టారు. ఈ ధర్నాకు అసెంబ్లీ కన్వీనర్ రమేష్‌రామ్ అధ్యక్షత వహించగా రాంనగర్ డివిజన్ కార్పొరేటర్ కె.రవిచారి, ముషీరాబాద్ డివిజన్ కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్, కవాడిగూడ డివిజన్ కార్పొరేటర్ రచనశ్రీ, మాజీ బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు భరత్‌గౌడ్ తదితరులు హాజరై ప్రసంగించారు. నిరుద్యోగుల జీవితాలతో బీఆర్ఎస్ ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని ఆరోపించారు.

- లిక్కర్ స్కామ్‌లో కవిత ఢిల్లీ వెళ్తే ఎమ్మెల్యేలు, మంత్రులంతా కట్టకట్టుకుని ఆమెకు మద్దతుగా ఢిల్లీకి పయనమయ్యారన్నారు. ఆమెపై ఉన్న ప్రేమ నిరుద్యోగ అభ్యర్థులపై ఎందుకు లేదని ప్రశ్నించారు. బీజేపీ సీనియర్ నాయకులు వినయ్‌కుమార్, రామ్‌రెడ్డి, వెంకటేష్, మంగళ, యాదగిరిగౌడ్, పద్మజారెడ్డి, రమేష్‌గుప్తా, అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షులు నరేష్, మాధవి, వేణు, కౌండిన్య ప్రసాద్ తదితరులున్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో..

- టీఎస్‌పీఎస్సీ పరీక్షల ప్రశ్న పత్రాల లీకేజీలో ప్రమేయం ఉన్న మంత్రి కేటీఆర్‌ను వెంటనే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేసి కేసు నమోదు చేయాలని యూత్ కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్‌యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం ముషీరాబాద్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ నేతల హస్తం పేపర్ లీకేజీలో ఉందని వారిని వెంటనే అరెస్ట్ చేసి కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్న ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. మాజీ కార్పొరేటర్ వాజిద్ హుస్సేన్, కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ ఉపాధ్యక్షులు పాశం అనిల్ కుమార్‌యాదవ్, మేడి సురేష్‌కుమార్, కార్యదర్శి శ్రీనివాస్‌యాదవ్, ఓబీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి నక్క కృష్ణగౌడ్, నాయకులు పీటర్, ఆర్.ఎల్.రమేష్, సమీర్, అభిషేక్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

23న సివిల్స్ ప్రిలిమ్స్‌పై ఉచిత అవగాహన సదస్సు

చిక్కడపల్లి: సివిల్స్ ప్రిలిమ్స్‌పై ఉచిత అవగాహన సదస్సును ఈనెల 23న సాయంత్రం 4గంటలకు అశోక్‌నగర్‌లోని శరత్‌చంద్ర అకాడమీలో నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ శరత్‌చంద్ర ప్రకటించారు. సివిల్స్ ప్రిలిమ్స్ పరీక్షలో ప్రిలిమ్స్ పాస్ అయ్యేందుకు అనుసరించాల్సిన అంశాలపై వివరించనున్నారు. సమయపాలన చేయకూడని పొరపాట్లు తదితర విషయాలపై అభ్యర్థులకు అవగాహన కల్పించేందుకు ఈ ఉచిత అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో గతేడాది సివిల్స్ ర్యాంక్ సాధించిన వారితో పాటు ఐఏఎస్. ఐఆర్ఎస్ అధికారులు అభ్యర్థులకు అవగాహన కల్పిస్తారన్నారు. కేవలం 30 రోజుల్లో ప్రిలిమ్స్ సిలబస్ రివిజన్ అయ్యే విధంగా రూపొందించిన క్రాష్‌కోర్స్ అడ్మిషన్స్‌కి సంబంధించిన స్కాలర్‌షిప్ టెస్ట్ కూడా అదే రోజు జరుగుతుందని వివరించారు.